క్లుప్తంగా

పీ-4 లబ్ధిదారుల గుర్తింపునకు రీసర్వే



కరపలో పీ-4 రీసర్వేపై శిక్షణ ఇస్తున్న జేడీ, సీపీఓ త్రినాథ్

కరప: గ్రామాల్లో రీసర్వే నిర్వహించి, పీ-4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) లబ్ధిదారులను గుర్తించాలని జాయింట్ డైరెక్టర్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పి.త్రినాథ్ సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం గ్రామ కార్యదర్శులు, సచివాలయం అసిస్టెంట్లకు ఏర్పాటు చేసిన పీ-4 రీసర్వే శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో ఇంతకు ముందు జరిపిన పి-4 సర్వేలో 3,193 మంది కుటుంబాలను గుర్తించామన్నారు. నిబంధనల మేరకు రీసర్వే చేసి, నిజమైన లబ్ధిదారు(జీరో పావర్టీలో ఉన్నవారిని)లను గుర్తించాలన్నారు. సర్వే అనంతరం గ్రామ సభ నిర్వహించి, గ్రామస్తుల సమక్షంలో పీ-4 లబ్ధిదారుల జాబితాను రూపొందించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు, కె.కార్తీక్ తదితరులు శిక్షణ ఇచ్చారు.

నోరు, కళ్లు పొడిబారడం ఆ వ్యాధి లక్షణం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అడ్డాల సత్యనారాయణ

బోట్‌క్లబ్: స్జోగెన్ సిండ్రోమ్ వ్యాధి వస్తే నోరు, కళ్లు పొడిబారతాయని ఇండియన్ డెంటల్ అసోసియేసన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక సత్య దంత వైద్యశాల్లో బుధవారం స్జోగెన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా రోగులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వ్యాధి లాలాజలం ఉత్పత్తి చేసే గ్రంథులపై దాడి చేస్తోందన్నారు. ఈ వ్యాధి సోకితే అందరిలోనూ లక్షణాలు ఒకేలా ఉండవని, కొందరిలో కీళ్ల నొప్పులు, వాపు, అలసట, బలహీనత, గొంతు నొప్పి, పొడి దగ్గు ఉంటాయన్నారు. దంతాలు ఎనామెల్‌ను బలోపేతం చేయడానికి ఫ్లోరైడ్ అప్లికేషన్, దంతాలను తరచూ శుభ్రం చేసుకోవాలన్నారు. నోటిలో లాలాజలం కోసం షుగర్ లేని చూయింగ్ గమ్‌లను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీవల్లి, లిఖిత, మాధురి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌బాబు

బోట్‌క్లబ్: బీజేపీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మొసలగంటి సురేష్‌బాబు అన్నారు. స్థానిక ఎల్‌బీనగర్‌లోని ఆయన నివాసంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీలో కష్టపడి పని చేస్తే పదవులు వాటంతటే అవే వస్తాయనడానికి తానే నిదర్శనమన్నారు. బ్రాహ్మణ వర్గానికి చెందిన తనకు జిల్లా పార్టీ ఉపాధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరావు, రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో జిల్లా అంతటా పర్యటించి పార్టీ గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకొంటానన్నారు.

పేద విద్యార్థుల చదువుకు రూ.లక్ష విరాళం



పేద విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న పవన్

కాకినాడ క్రైం: పేద విద్యార్థుల చదువుకు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అల్లుడు తోట పవన్ చేయూతనిచ్చారు. బుధవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా లక్ష రూపాయల మొత్తాన్ని కాకినాడకు చెందిన స్త్రీ యువసేన స్వచ్ఛంద సేవాసంస్థకు అందజేశారు. ఈ మొత్తాన్ని సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్‌కు అందజేసి తండ్రిని కోల్పోయిన పిల్లల చదువుకోసం వినియోగించాలని కోరారు. కాకినాడ ముత్తానగర్ మున్సిపల్ పాఠశాలకు వెళ్లి అక్కడ చదువుతున్న 50 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు దుర్గన బాబ్జి, రేలి సతీష్, వసంత, అగ్రహారపు సతీష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే వారధులు

- జఠిలమవుతున్న ట్రాఫిక్ సమస్యలు
- పాఠశాలలు, కళాశాలల్లో నిబంధనలపై అవగాహన
- విద్యార్థులను ఎంచుకున్న పోలీసులు
- ఆ దిశగా కార్యక్రమాలు చేపడుతున్న ట్రాఫిక్ సీఐలు రమేష్, రామారావు



కాకినాడలోని ఓ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్



కాకినాడ గ్రామీణంలో విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన కల్పిస్తున్న సీఐ రామారావు



హెల్మెట్లపై అవగాహనలో పాల్గొన్న విద్యార్థులు

కాకినాడ క్రైం: ట్రాఫిక్ సమస్య నానాటికీ జఠిలమవుతోంది. గమ్యంతోనే కాదు జీవిత గమనంతో కూడా ట్రాఫిక్ క్రమశిక్షణ ముడిపడి ఉంది. నిబంధనలకు లోబడి వాహనంతో ముందుకెళ్లాలన్నా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలన్నా నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంది. అయితే, అన్నీ తెలిసీ కొందరు చేస్తున్న పొరపాట్ల కారణంగా తోటి ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. ఇటువంటి స్థితికి ట్రాఫిక్ నియమాలపై అవగాహన లోపించడమే కారణమని నిపుణుల పరిశీలనలో తేలింది. ఈ పరిస్థితిని నిలువరించేందుకు పోలీసులు విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని గ్రహించారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ పర్యవేక్షణలో కాకినాడ ట్రాఫిక్ సీఐలు నూని రమేష్, దానేటి రామారావు విద్యార్థులనే వారధులుగా, ట్రాఫిక్ రథసారథులుగా తీర్చిదిద్దేందుకు సమాయత్తమయ్యారు. ఈ వినూత్న ఆలోచన, ఆచరణకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

ఆలోచన వెనకున్న ఆశయం

విద్యార్థులను ట్రాఫిక్ రథసారథులుగా తీర్చిదిద్దడం వల్ల భవిష్యత్తులో ప్రమాదాల సంఖ్య తగ్గుతుందని పోలీసులు ఇటు వైపు అడుగులు వేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనల అవగతం, ప్రచారం విద్యార్థుల ద్వారా సక్రమంగా జరుగుతుందని పోలీసులు భావిస్తున్నారు. విద్యార్థి దశలో వారి గ్రహణ శక్తితోపాటు, అన్ని వర్గాల్లోకి చొచ్చుకెళ్లే వయసు, తత్వం ఉందని చెబుతున్నారు. నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రుల నుంచి స్నేహితులు, బంధువులతో సహా అవకాశం ఉన్న అన్ని సందర్భాలలోనూ వెల్లడిస్తుంటారని, అందుకే వారిని ఎంచుకున్నట్టు చెబుతున్నారు. అంతేకాకుండా విద్యార్థులు సామాజిక మాధ్యమాల వినియోగంలో చురుగ్గా ఉంటారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ట్రాఫిక్ నిబంధనలు, ఆచరణ వల్ల కలిగే ప్రయోజనాలను విస్తృతం చేయాలని సూచిస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలు

వారంలో కనీసం రెండు రోజులు కళాశాలలు, పాఠశాలల్లో ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించి కాకినాడ ట్రాఫిక్-1 సీఐ నూని రమేష్, ట్రాఫిక్-2 సీఐ దానేటి రామారావులు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలతో పాటు, ఉల్లంఘించిన వారిపై తీసుకున్న చర్యలు, జరిగే ప్రమాదాలు, న్యాయంగా వచ్చే చిక్కులు తదితర వాటి గురించి వివరిస్తున్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాఠాంశాల్లో భాగం కావాలని ఉపాధ్యాయులకు సూచిస్తున్నారు. ప్రాంతాల వారీగా విద్యాలయాల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా తరగతులు నిర్వహించాలని సంకల్పించారు.

పాఠ్యపుస్తకంలో పాఠం కావాలి

ట్రాఫిక్ నిబంధనలు పాఠ్య పుస్తకంలో పాఠం కావాలి. ఉపాధ్యాయులు ఆ దిశగా చొరవ తీసుకోవాలి. ట్రాఫిక్ అవగాహనకు సంబంధించిన వివిధ చట్టాలు, చర్యలు అందులో పొందుపరచాలి. పాఠశాల దశ నుంచే వీటిపై పిల్లలకు అవగాహన కలిగించాలి. తరచూ పరీక్షలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ప్రోత్సహించాలి. ట్రాఫిక్ వారోత్సవాల సమయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు విద్యాలయాల స్థాయిలో నిర్వహించి విద్యార్థుల భవితకు యాజమాన్యాలు దోహదపడాలి.

– నూని రమేష్, సీఐ, ట్రాఫిక్-1, కాకినాడ

అలా తీర్చిదిద్దండి



విద్యార్థులపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సామాజిక బాధ్యతను పెంపొందించాలి. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు ఆచరణను ప్రోత్సహించాలి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడంలో అధిక సంఖ్యాకులు విద్యార్థులు, యుక్తవయసు వారే ఉంటుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి ఇంటి నుంచే పునాది పడాలి. లగ్జరీ వాహనాలు కొనిచ్చి పిల్లల జీవితాన్ని తల్లిదండ్రులే నాశనం చేయడం సరికాదు.

– దానేటి రామారావు, సీఐ ట్రాఫిక్-2, కాకినాడ

శాకంబరిగా బంగారమ్మ అమ్మవారు



తిమ్మాపురంలో శాకంబరిగా భక్తులకు దర్శనమిస్తున్న బంగారమ్మతల్లి అమ్మవారు

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామంలోని ఉన్న బంగారమ్మతల్లి శాకంబరిగా భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. అమ్మవారిని గ్రామస్తులు కూరగాయలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శనాలు చేసుకున్నారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ ఎత్తున అన్న సంతర్పణ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జీజీహెచ్‌కు క్యాన్సర్ రేడియేషన్ పరికరాలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడ జీజీహెచ్‌కు క్యాన్సర్ రేడియేషన్ ఆధునిక పరికరాలు త్వరలో రానున్నాయని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధిపై పోరాటంలో సహకారంగా ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.16 కోట్లతో జీజీహెచ్‌లో క్యాన్సర్ పరికరాలు అందజేసేందుకు ముందుకు వచ్చిందన్నారు. క్యాన్సర్‌పై పోరాటానికి కేంద్ర ప్రభుత్వం ఎంతగానో చొరవతీసుకొంటున్నట్టుచెప్పారు.

ఆడబిడ్డ నిధి కోసం ఆంధ్రను అమ్మేయాలనడం సిగ్గుచేటు

జమ్మలమడక నాగమణి



కాకినాడ రూరల్: ఆడ బిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్ర రాష్ట్రాన్ని అమ్మేయాలని మంత్రి అచ్చం నాయుడు వ్యాఖ్యానించడం సిగ్గు చేటని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. బుధవారం ఆమె మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఎన్నికల ముందు అమలు చేయడానికి వీలుకాని హామీలను కూటమి నాయకులు వాగ్దానం చేసి ఇప్పుడు చేతులెత్తుతున్నారన్నారు. ఆడ బిడ్డ నిధితో పాటు ఇచ్చిన హామీలన్ని నెరవేర్చాలని మహిళలు కోరుకుంటున్నారని, అరకొర పథకాలుతో కూటమి ప్రభుత్వం కాలక్షేపం చేస్తుందన్నారు. ఏడాదిలో లక్షా 60వేల కోట్ల రూపాయాలు అప్పులు తెచ్చి ఎవరి జేబులు నింపారో ప్రజలకు తెలపాలన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదన్నారు.

మాతాశిశు మరణాలు అరికట్టడమే లక్ష్యం



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు

కాకినాడ క్రైం: జిల్లాలో మాతాశిశు మరణాలను అరికట్టడమే లక్ష్యంగా వైద్య అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు ఇంటిగ్రేటెడ్ హై రిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్‌మెంట్ ప్రొటోకాల్ ఫేజ్ టూ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీఎంహెచ్ఓ డాక్టర్ నరసింహ నాయక్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కాకినాడ వివేకానంద పార్కు ఆవరణలో ఉన్న స్మార్ట్ సిటీ హాల్లో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యాధికారులకు శిక్షణ ప్రారంభించారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులు గుర్తించే విధానం, అందించాల్సిన వైద్య సేవలు, సందర్శన, తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లు డాక్టర్స్ స్రవంతి, జగదాంబ, దీపికలు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్స్ సుబ్బరాజు, ప్రభాకర్, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించండి



సారా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

కాకినాడ రూరల్: వాకలపూడి గ్రామంలో సారా నిర్మూలనకు గ్రామస్తులు సహకరించాలని ఎక్సైజ్ శాఖ నార్త్ స్టేషన్ ఎస్సై వరహాలు కోరారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు అధ్యక్షతన సారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వరహాలు మాట్లాడుతూ గ్రామస్తులు సారా తయారీ జోలికి వెళ్లకుండా ఇతర జీవనోపాధి చూసుకోవాలని, ఇందుకు ప్రభుత్వ పరంగా అన్ని శాఖల నుంచి సహకారం అందుతుందన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ

- శాకంబరిగా బాలాత్రిపుర సుందరీదేవి
- నూకాలమ్మ ఆలయం నుంచి సారె ఊరేగింపు



పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారికి సారె తీసుకువెళుతున్న భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయం బుధవారం భక్తుల రద్దీతో కిటకిట లాడింది. ఆషాఢ మాసం, మాస శివరాత్రి, స్వామివారి ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో ఆలయంలోని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి శాకంబరిగా అలంకరించారు. ప్రతి ఏడాది ఆషాడ మాసం మాస శివరాత్రి రోజున అమ్మ వారిని శాకంబరిగా అలంకరణ చేయడం జరుగుతుంది. ప్రస్తుతం స్వామివారి జన్మనక్షత్రం కలిసి రావడంతో ఆలయంలోని బాలాత్రిపుర సందరీ దేవి, సరస్వతీదేవి, మహిషాసురమర్దిని అమ్మవార్లను కూరగాయలు, పండ్లతో అలంకరించారు. అమ్మవారి అలంకరణను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శాకంబరి అలంకరణను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయంలోని ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం కూరగాయలతో అలంకరించారు. అదేవిధంగా స్వామివారిని కూడా కూరగాయలతో అలంకరణ చేశారు. ఆలయ నంది మండపం వద్ద ఆలయ నమూనాను కూరగాయలతో చేసిన అలంకరణ ఎంతగానో ఆకట్టుకుంది.

లక్ష పసుపు కొమ్ముల నోము

ఆలయంలో మొదటిసారిగా ముత్తైదువులు లక్ష పసుపు కొమ్ముల నోమును నిర్వహించారు. భక్తులు తీసుకు వచ్చిన సారె, పసుపు కొమ్ములను ప్రత్యేక వేదికపై ఉంచి పంచారామ క్షేత్ర అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం నుంచి మహిళలకు పసుపు కొమ్ములు, జాకెట్టు ముక్కలు పంపిణీ చేశారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వెంకటరమణ, మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వర రావు, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

శాకంబరిగా శ్రీమహాలక్ష్మి

పిఠాపురం: ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పిఠాపురంలో కొలువైయున్న శ్రీ శృంగేరి శంకరమఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారు బుధవారం శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం ముగింపులో భాగంగా పిఠాపురం మహాలక్ష్మి అమ్మవారిని ఆలయ నిర్వాహకులు ఇంద్రగంటి వెంకటగోపాలకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని విశేషంగా వివిధ రకాల కాయగూరలతో పండ్లతో శాకంబరీ దేవిగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన నిర్వహించారు.భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి

గొల్లప్రోలు మండలం దుర్గాడలో శ్రీరామలింగేశ్వర స్వామిని బుధవారం ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలో రైతులు పండించిన కూరగాయలతో ఏటా ఆషాఢమాసంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించడం ఆనవాయితీగా వస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కాకినాడ రూరల్: కాకినాడ ప్రతాప్‌నగర్ సెక్షన్‌లోని 11 కేవీ ఎస్.అచ్యుతాపురం ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలకు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఈఈ ఎస్.ఉదయ్ భాస్కర్ తెలియజేశారు. చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం చైతన్య నగర్ కాలనీ బెన్నీ చర్చ్, మధురానగర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రమణయ్యపేట సెక్షన్ పరిధిలో..

కాకినాడ రూరల్: విద్యుత్ స్తంభాల మార్పు కారణంగా రమణయ్యపేట సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఉదయ్ భాస్కర్ తెలియజేశారు. సర్పవరం సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ సింహాద్రినగర్ ఫీడర్‌పై విజ్ఞేశ్వర్ నగర్ ఏరియా, సంతోష్‌నగర్, కూరగాయల మార్కెట్ ఏరియా, ఆర్టీసీ కాలనీ, శారద నగర్, వైద్యనగర్, ఇందిరా కాలనీ, కాల్వ గట్టు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

కాకినాడ రూరల్: కాకినాడ నగరపాలక సంస్థలో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న సర్పవరం గ్రామంలోని భావనారాయణపురం ప్రాంతానికి చెందిన జానపిల్లి గోపి(26) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సర్పవరం పోలీసులు వివరాల ప్రకారం.. గోపికి వివాహమై రెండేళ్లయింది. కొడుకు పుట్టిన రోజు చేసేందుకు సుమారు రూ.3లక్షల వరకు అప్పులు చేశాడు. అవి తీర్చలేక మంగళవారం రాత్రి మద్యం సీసాలో పురుగు మందు కలిపి సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా రాత్రే మృతి చెందాడు. మృతుడు తండ్రి అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పవరం ఎస్సై ఆచారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులు

కాకినాడ రూరల్: భారత స్వాతంత్య్ర సమరయోధులు బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లకు నన్నయ్య ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో బుధవారం ఘన నివాళులర్పించారు. అచ్చంపేట జంక్షన్ వద్ద పీజీ సెంటరు క్యాంపస్‌లో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తిలక్, ఆజాద్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటాలను ప్రిన్సిపాల్ ప్రశాంతి అధ్యాపకులు నానిబాబు, పోచయ్య, మధుకుమార్, వరప్రసాద్, హారిక, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

కాకినాడ తీరప్రాంత రక్షణకు చర్యలు తీసుకోవాలి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): సముద్ర అలల కారణంగా కోతకు గురవుతున్న కాకినాడ తీర ప్రాంతాన్ని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా ఎంపీ బుధవారం లోక్ సభలో కాకినాడ తీర ప్రాంతంలో 52.8 శాతం భూభాగం కోతకు గురైందని, రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రీన్‌ట్యాక్స్ రద్దుతో తగ్గిన ప్రభుత్వ ఆదాయం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గ్రీన్‌ట్యాక్స్ తగ్గించడం ద్వారా సుమారు 130 కోట్ల రూపాయల ఆదాయం కోల్పోతున్నామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎం.రామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. కాకినాడ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభిస్తున్నామని, ఇందుకు 1400 బస్సులు కనుగోలు చేస్తున్నామన్నారు. అనంతరం రవాణాశాఖ రూపొందించిన రోడ్డుభద్రత పోస్టర్ ఆవిష్కరించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయిని ఆత్మహత్యాయత్నం



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న దూడల సుశీల

కాకినాడ క్రైం: ఉన్నతాధికారులు తనను ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ కాకినాడకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని ఆత్మహత్యకు యత్నించింది. వివరాలలోకెళితే బాధితురాలు, ఆమె భర్త తెలిపిన వివరాల మేరకు కాకినాడ గంగరాజు నగర్‌కు చెందిన దూడల సుశీల రంగంపేట మండలం వెంకటాపురంలో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తుండగా అక్కడి హెచ్ఎం, సహ ఉపాధ్యాయులు తనపై తప్పుడు ఆరోపణలు చేసి సస్పెండ్ చేయించారని బాధితురాలు తెలిపింది. రీ పోస్టింగ్ కోసం కోర్టును ఆశ్రయించగా ఉద్యోగం ఇప్పిస్తానని రాజమండ్రి జిల్లా విద్యాశాఖాధికారి తనకు భరోసా ఇచ్చి కాకినాడ డీఈఓ రమేష్‌కు సిఫారస్ చేసినట్టు పేర్కొంది. ఆయన సిఫారస్ మేరకు డీఈఓ రమేష్‌ను ఆశ్రయించగా తనపై చులకనభావంతో మాట్లాడారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేరకు కాకినాడ డీఈఓ తప్పనిసరి స్థితిలో తనను ఇబ్బందిపెట్టే లక్ష్యంతో కాకినాడకు సుదూరంగా ఉన్న గండేపల్లి మండలం కె.గోపాలపురానికి పోస్టింగ్ ఇచ్చినట్టు తెలిపింది. స్త్రీ అయి ఉండి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తాను రవాణ సదుపాయాలు సరిగా లేని గ్రామానికి వెళ్లి ఉద్యోగం చేయడం కష్టమైందని వాపోయారు. ఆయన వేధింపులు తాళలేక సుదూర ప్రయాణం చేయలేక మనోవేదనకు గురై నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించినట్టు వాగ్మూలంలో పేర్కొంది. తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా స్త్రీ అన్న మానవత దృక్పదంతో విధులకు అనుకూలమైన ప్రాంతానికి పోస్టింగ్ ఇవ్వాలని అభ్యర్థించింది. బదిలీ పేరుతో తనను వేధింపులకు గురి చేసిన డీఈఓ రమేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె ఆత్మహత్యకు పాల్పడ్డాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా వైద్యసేవలు అందుతున్నాయి.

ఒత్తిడి కారణంగా మెదడు సంబంధ సమస్యలు

కాకినాడ రూరల్: మానవ శరీరంలో అతి కీలకమైన పాత్ర పోషించే అవయవాలలో మెదడు ఒకటని, ప్రస్తుత కాలంలో తీవ్రమైన ఒత్తిడి కారణంగా అనేక రకాల మెదడు సంబంధిత సమస్యల తలెత్తుతున్నాయని ప్రముఖ న్యూరో సర్జన్ చందు లింగోలు పేర్కొన్నారు. వరల్డ్ బ్రెయిన్ డేను పురస్కరించుకుని అచ్చంపేట జంక్షన్ వద్ద కాకినాడ మెడికవర్ ఆస్పత్రిలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆస్పత్రి యూనిట్ హెడ్ శుభాకరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రోగులు, స్థానికులకు మెదడు పనితీరు, మెదడు సంబంధిత సమస్యలు గురించి వివరించారు. మరో న్యూరో సర్జన్ కృష్ణ భాస్కర్ మాట్లాడుతూ గతంలో 50ఏళ్లు పైబడిన వారే బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యేవారని కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని 20ఏళ్లకు ఈ తరహా సమస్యలతో చాలా మంది బాధపడుతున్నారన్నారు. మెడికవర్ యూనిట్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ ఎంఆర్ఐ, సీటీ ఇతర డయాగ్నోస్టిక్ సేవలు తమ ఆస్పత్రిలో 24 గంటలు అందుబాటులో ఉంటాయని అత్యవసర పరిస్థితిలో ఉంటే ఆలస్యం చేయకుండా వస్తే వైద్యులు సంరక్షణ ఉంటుందన్నారు.

దేవదాయ భూములను పరిరక్షించాలి



ఆందోళన చేస్తున్న గోర్స గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

కొత్తపల్లి: అన్యాక్రాంతమైన ఆలయాల భూములను దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవాలంటూ మండలంలోని గోర్స గ్రామస్తులు కొమరగిరిలో ఉన్న దేవదాయ భూముల వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. గోర్సలో ఉన్న పురాతన సీతారామ ఆలయానికి సంబంధించిన భూములు సర్వే నంబర్ 121,122లో గల 19.92 ఎకరాలను కొంతమంది కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారు. ఇటీవల ఈ భూముల విషయంలో గ్రామస్తులు స్థానిక సచివాలయం వద్ద అధికారులను నిర్బంధించారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద కూడా ఆందోళన నిర్వహించారు. గ్రామంలో ధర్నాలు, ఆందోళనలు నిర్వహించారు. ఈ భూముల్లోకి ఏ ఒక్కరూ రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఇటీవల కొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. అయినప్పటికీ పంటలు సాగుచేస్తున్న రైతులు వివాదాస్పద భూముల్లోకి వెళ్లి పనులు చేపట్టడంతో గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దేవుడు భూములను సాధించుకునే వరకూ పోరాటం ఆగదన్నారు. అవసరం అయితే గ్రామస్తులంతా కలసి భూముల వద్ద ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతామన్నారు. పోలీసులు వచ్చి ఇరువర్గాల వారిని నచ్చజెప్పి పంపించారు. వివాదం పరిష్కారమయ్యే వరకూ భూముల వద్దకు ఏ ఒక్కరూ ప్రవేశించరాదని ఆదేశించారు. దేవుని భూమి రక్షించడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని సర్పంచి రొంగల వీరబాబు అన్నారు. ఆందోళన ఉద్యమం చేపట్టినప్పుడు వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పి తరువాత పట్టించుకోవడంలేదని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని గ్రామస్తులతో కలిసి ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దేవుని భూములు ఆలయానికి దక్కే వరకూ పోరాటం కొనసాగిస్తామని మాజీ సర్పంచి గంధం సత్యన్నారాయణ అన్నారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి



తునిలో మానవ అక్రమ రవాణాపై అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు

తుని: మానవ అక్రమ రవాణాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రైల్వే ప్రొటెక్షన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటస్వామి సూచించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో బుధవారం రైల్వే పోలీసు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, క్రాప్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ బాలల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ప్రయోజనాల కోసమే మానవ అక్రమ రావాణా సాగుతోందన్నారు. ఉపాధి కల్పిస్తామని బలవంతంగా పనుల్లో పెట్టుకోవడం, బాల్య వివాహాలు చేసుకోవడం నేరమన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలు, అణగారిన వర్గాలు, నిరక్షరాస్యులు, వయస్సులో ఉన్న స్త్రీలు, చిన్నపిల్లలు అక్రమ రవాణ బారిన పడుతున్నారని తెలిపారు. మానవ అక్రమ రవాణా నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్రాప్ స్వచ్ఛంద సేవా సంస్థ కో ఆర్డినేటర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.